సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 28 । మార్చి । 2023



పట్టాలిచ్చే వరకు పోరాటం

పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చే వరకు పోరాడుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. 8లో▸



హైటెక్ వ్యభిచారం

వ్యభిచారం నిర్వహిస్తున్న ఫాం హౌస్‌పై పోలీసులు దాడి చేసి 15మంది యువకులు, నలుగురు యువతులను పట్టుకున్నారు. 8లో▸

పోస్టుల భర్తీకి ఆహ్వానం

మొయినాబాద్: చిలుకూరు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియెట్‌లో జేఈఈ, నీట్ శిక్షణ ఇవ్వడానికి అర్హులైన గణితం, జువాలజీ బోధించేందుకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఈ నెల 29న నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రాంతీయ సమన్వయాధికారి శారద సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

నేర రహిత సమాజాన్ని నిర్మిద్దాం
ఏసీపీ కుషాల్కర్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ కుషాల్కర్

షాద్‌నగర్‌రూరల్: నేర రహిత సమాజ నిర్మాణంకోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏసీపీ కుషాల్కర్ అన్నారు. మున్సిపల్ పరిధి సాయిబాబ కాలనీలోని పోచమ్మ దేవాలయంలో సోమవారం కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు, దోపిడీలను అరికట్టవచ్చని అన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసుల బందోబస్తుతో సమానమన్నారు. ఇళ్లు, వ్యాపార సముదాయాలు, దేవాలయాలవంటి ప్రాంతాల్లో తప్పనిసరి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు సంచరించినా, అనుమానాస్పదంగా తిరుగుతున్నా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిల ర్ లత, నాయకులు పినపాక ప్రభాకర్, బెన్నూ రి చంద్రయ్య, ఆంజనేయులుగౌడ్, వెంకటయ్య, వెంకన్నబాబు, నర్సింలు, కరుణాకర్, రాజేష్, శివ, అమర్‌నాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాధవరెడ్డి, కృష్ణారెడ్డి, క్రాంతికుమార్, శామ్యూల్, రాంరెడ్డి, రవి, రమామహేశ్వర్, మొగులయ్య, రవీందర్, రమణారెడ్డి, తిరుప తయ్య, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'ప్రజావాణి'



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ తిరుపతిరావు

ఇబ్రహీంపట్నం రూరల్: సమస్యలు పరిష్కరించేందుకే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తిరుపతిరావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు వినేందుకే ఉన్నామని, అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కారమయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ వారం 80 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త



విద్యార్థులతో మాట్లాడుతున్న సైబర్‌క్రైం డీసీపీ అనురాధ

హయత్‌నగర్: చదువుకున్నవారే ఎక్కువగా సైబర్ నేరాల బారిన పడుతున్నారని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సైబర్‌క్రైం డీసీపీ అనురాధ అన్నారు. సైబర్ వేధింపులు, నేరాలపై సోమవారం కుంట్లూర్‌లోని పల్లవి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్మార్ట్‌ఫోన్లు వాడుతున్న వారు ఎక్కువగా మోసాలకు గురవుతున్నారని, ఆకర్షణీయమైన ఆఫర్లకు స్పందించొద్దని తెలిపారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్‌కు ఓటీపీ షేర్ చేయొద్దని, వ్యక్తిగత వివరాలను ఎవరితో పంచుకోవద్దని, సైబర్ మోసాలు జరుగుతున్నట్లు తెలిస్తే వీలైనంత త్వరగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్ల వినియోగంపై సైబర్‌క్రైం ఏసీపీ వెంకటేశం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పల్లవి ఇంజనీరింగ్ కళాశాలల చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ యశస్వి, సీఐ వెంకటేశ్వర్లు, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ చీఫ్ కోఆర్డినేటర్ సావిత్రి, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ పాల్గొన్నారు.

ఆ సారు.. రూటే వేరు!

సొత్తు రికవరీలో వాటా సమర్పించాల్సిందే
- మాట వినకుంటే అక్రమ కేసులు నమోదు
- జనరేటర్ కోసమని ఓ వ్యాపారి నుంచి డబ్బు వసూలు
- మూడుసార్లు మెమో జారీ చేసినా.. మారని ప్రవృత్తి
- నార్సింగి డివిజన్‌లోని ఓ ఠాణా అధికారి తీరు
- చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారుల తాత్సారం



సాక్షి, రంగారెడ్డి జిల్లా: రక్షించాల్సిన పోలీసులే భక్షిస్తున్నారు. న్యాయం చేయండయ్యా మహాప్రభో అని పోలీసు స్టేషన్ మెట్లెక్కిన పాపానికి అందినకాడికి దోచుకుంటున్నారు. దొంగల నుంచి సొత్తు రికవరీ చేసి చట్ట ప్రకారం బాధితులకు అందించాల్సిన వారే కొంత వాటా నొక్కేస్తున్నారు. ఇదేం అన్యాయమని ప్రశ్నించిన వాళ్లపై చట్టాన్ని అడ్డుపెట్టుకొని ఉల్టా(అక్రమ) కేసులు బనాయిస్తున్నారు. అంతేకాదు స్టేషన్‌లో పనిచేసే ఓ మహిళా కానిస్టేబుల్‌కు సైతం రక్షణ లేకుండా పోయింది. సైబరాబాద్ కమిషనరేట్ నార్సింగి డివిజన్‌లోని ఓ పోలీసు స్టేషన్ అధికారి తీరుకు ఇదీ నిదర్శనం.

అక్రమ కేసులు బనాయిస్తూ..

సదరు స్టేషన్ అధికారి సివిల్ తగాదాల్లో తల దూర్చుతూ అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరానికి చెందిన ఓ వ్యక్తి ఠాణా పరిధిలోని ఓ గ్రామంలో కొన్నేళ్ల క్రితం కొంత భూమిని కొనుగోలు చేశాడు. ఈ స్థలం వెనకాల ఉన్న వారికి రహదారి లేకపోవటంతో..స్థానిక పోలీసు అధికారిని సంప్రదించి విషయాన్ని వివరించారు. దీన్ని ఆసరాగా చేసుకున్న సదరు పోలీసు..భూ యజమానిని పిలిపించి రోడ్డు ఇవ్వాలని ఆదేశించాడు. ససేమిరా అని చెప్పిన ఓనర్.. తన వద్ద అన్ని రకాల డాక్యుమెంట్లు ఉన్నాయని, ప్రభుత్వ అధికారులు అందించిన సర్వే రిపోర్టును సైతం చూపించాడు. తన స్థలాన్ని ఆక్రమించకుండా రేకుల షెడ్డును నిర్మించుకున్నాడు. దీంతో కోపం తెచ్చుకున్న సదరు పోలీసు.. భూ యజమాని, అతని ముగ్గురు అనుచరులపై అక్రమంగా కేసు నమోదు చేశాడు. బాధితులు హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే గ్రామంలో చోటు చేసుకున్న ఓ చిన్నపాటి తగాదాలో పెద్ద మనిషిగా వెళ్లిన పాపానికి ఓ సర్పంచ్‌పై ఏకంగా మూడు కేసులు బనాయించడం గమనార్హం.

రాజీకొస్తే కేసులు నమోదు

ఇటీవల పక్క జిల్లాకు చెందిన కొందరు స్నేహితులు కలిసి మండలంలోని ఓ గ్రామంలో పార్టీ చేసుకున్నారు. తిరుగు ప్రయాణంలో వీరి కారు దోబీపేట వద్ద ప్రమాదానికి గురైంది. కేసు ఎందుకులే అని భావించిన ఇరు కార్ల యజమానులు రాజీ కుదుర్చుకొని వెళ్లిపోయారు. తన ప్రమేయం లేకుండా రాజీ కుదుర్చుకుంటారా అని ఆగ్రహించిన సదరు పోలీసు..ఘటన జరిగిన ఐదు రోజుల తర్వాత ఇరువురి యజమానులను స్టేషన్‌కు పిలిపించి కేసు నమోదు చేయడం గమనార్హం. మరో ఘటనలో స్థానికంగా ఇద్దరు యువకుల మధ్య తగాదా జరిగింది. ఇరు కుటుంబాల పెద్దలు జోక్యం చేసుకొని స్థానికంగా ఉన్న ఓ ప్రజాప్రతినిధి సమక్షం లో రాజీ కుదిర్చారు. ఘటనతో ఎలాంటి సంబంధం లేని ఓ వ్యక్తి మాటలు విని ఇద్దరు యువకులపై కేసు నమోదు చేశారు.

దొరికింది ఎంతో.. ఇచ్చింది అంతంతే..

ఇటీవల ఓ కుటుంబం తిరుపతికి వెళ్లింది. తిరిగొచ్చేసరికి దొంగలుపడ్డారు. 20 తులాల బంగారం, నగదు చోరీ జరిగింది. పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. దొంగల నుంచి రికవరీ చేసిన బంగారాన్ని పూర్తిగా బాధితులకు అందించలేదనే ఆరోపణలు గుప్పుమన్నాయి. ఇదే విషయమై బాధితుడిని వాకబు చేయగా.. సదరు స్టేషన్ అధికారి రికవరీ చేసిన సొత్తులో కొంత నొక్కేశారని, మిగిలిన అరకొర బంగారం తనకెందుకంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే రెండు గ్రామాల్లో గొర్రెలు, మేకలు దొంగతనానికి గురికాగా.. కొన్నాళ్లకు దొంగలు దొరికారు. ఈ కేసులోనూ పోలీసు అధికారి చేతివాటం ప్రదర్శించాడని తెలిసింది. పోలీస్ స్టేషన్‌లో కరెంట్ సమస్య ఉందని, జనరేటర్ ఏర్పాటు చేయాలని భావించిన పోలీసు.. స్థానిక స్థిరాస్తి వ్యాపారి నుంచి రూ.లక్షల్లో సొమ్ము వసూలు చేసినట్టు సమాచారం. నేటికీ స్టేషన్‌లో జనరేటర్ మాత్రం ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

మహిళా కానిస్టేబుల్‌తో అసభ్య ప్రవర్తన

స్టేషన్‌లోని మహిళా కానిస్టేబుళ్లతోనూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారం క్రితం అర్ధరాత్రి 3 గంటల ప్రాంతంలో స్టేషన్‌కు వచ్చిన సదరు పోలీసు.. అప్పుడే డ్యూటీ ముగించుకొని బయటకు వచ్చిన ఓ లేడీ కానిస్టేబుల్‌ను తన వాహనంలో ఎక్కాలంటూ ఆదేశించాడు. తాను వెళ్లిపోతానని, వద్దని వారించినా వినకుండా బలవంతంగా వాహనంలోకి ఎక్కించుకున్నాడు. ఈ తతంగాన్ని గమనిస్తున్న మరో కానిస్టేబుల్ వీడియో చిత్రీకరించాడు. దీంతో 'నీకెక్కడేం పనంటూ వెళ్లిపో, మెమో జారీ చేస్తానని' బెదిరించాడు. మరుసటి రోజు సదరు బాధితురాలు తోటి కానిస్టేబుళ్లతో జరిగిన విషయాన్ని వివరించింది. ప్రస్తుతం ఠాణాలో ఇదే హాట్ టాపిక్‌గా మారింది.

మూడు మెమోలు జారీ..

సదరు పోలీసు అధికారిపై వస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులను వివరణ కోరేందుకు 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా.. ఆరోపణలు వస్తున్న మాట వాస్తవమేనని, ఇప్పటికే మూడు మెమోలు జారీ చేశామని తెలిపారు. స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) అంతర్గత విచారణ జరుగుతోందని, ఆరోపణలు నిజమని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు.



రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సబితారెడ్డి

మరో అవకాశం

- జీఓ నంబర్ 58,59 కింద రెగ్యులరైజ్ చేసుకునే వెసులుబాటు
- వచ్చేనెల ఒకటి నుంచి 30 వరకు దరఖాస్తులకు చాన్స్
- రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశంలో మంత్రి సబిత

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్న వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. జీఓ నంబర్ 58, 59 కింద దరఖాస్తు చేసుకుని, నిర్మాణాలను రెగ్యులరైజ్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు కట్ ఆఫ్ డేట్‌ను పునరుద్ధరించింది. 2020 జూన్ 2కు ముందు వెలిసిన నిర్మాణాలతో పాటు ఆక్రమణల్లో ఉన్న స్థలాలను క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఏప్రిల్ 1 నుంచి 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు మంత్రి సబితారెడ్డి సోమవారం మీర్‌పేట్ క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి ఆయా అంశాలపై చర్చించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గంలో 58 జీఓ ద్వారా 966 మంది లబ్ధిదారులకు హక్కులు కల్పించామని.. త్వరలోనే వీరికి పట్టాలు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు.

ఇప్పటికే 31 వేలకుపైగా దరఖాస్తులు

ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన నిర్మాణాలను, పేదల ఆక్రమణల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను వారిపేరున రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2014కు ముందు ఆక్రమణల్లో ఉన్నవాటికి అవకాశం కల్పించింది. గత ఏడాది ఫిబ్రవరి 21 మార్చి 31 వరకు దరఖాస్తుకు వెసులుబాటు ఇచ్చింది. జీఓ నంబర్ 58, 59 కింద జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 31,830 దరఖాస్తులు అందాయి. వీటిలో జీఓ నంబర్ 59కి సంబంధించి 13,229 ఉండగా, వీటి పరిధిలో 38,43,899 గజాల విస్తీర్ణం ఉంది. 120 నుంచి 250 గజాల వరకు ప్రభుత్వం నిర్ధారించిన భూమిలో 25 శాతం, 251 నుంచి 500 గజాల వరకు 50 శాతం, 500 నుంచి 1000 గజాల వరకు 75 శాతం, వెయ్యి గజాలకుపైగా ఉన్న స్థలాలకు వందశాతం విలువను ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని ప్రకటించింది. ఈ మేరకు ఇప్పటికే ఆయా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కూడా పూర్తయింది. ఇక 58 కింద అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కూడా పూర్తయి అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు అందించేందుకు రంగం సిద్ధం చేసింది.

మరింత మందికి లబ్ధి

ప్రభుత్వం కటాఫ్ డేట్ పెంచడంలో మరింత మందికి లబ్ధి చేకూరనుంది. 2014 నుంచి 2020 మధ్య కాలంలో అనేక భూములు ఆక్రమణలకు గురయ్యాయి. ఆయా భూముల్లో నిర్మాణాలు వెలిశాయి. వీరంతా దరఖాస్తు చేసుకుని, రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం లభించింది. వంద గజాల్లోపు ఉన్న నిర్మాణాలను ఉచితంగా రెగ్యులరైజేషన్ చేయనుండగా, అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో వెలిసిన నిర్మాణాలకు నామమాత్రపు చార్జీ వసూలు చేయనున్నారు. సమావేశంలో కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్లు జనార్దన్‌రావు, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పార్టీ శ్రేణులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని సాయిరాజా ఫంక్షన్ హాల్‌లో సోమవారం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్‌గౌడ్ అధ్యక్షతన బూత్ స్వశక్తీకరణ్ అభియాన్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బొక్క నర్సింహారెడ్డి మాట్లాడు తూ.. దేశ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. తెలంగాణలో నియంత పాలన సాగుతోందని, దీనికి చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి చైతన్య పర్చాలని సూచించారు. రాష్ట్రంలో ఎప్పుడైనా ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని, ప్రతి కార్యకర్త పార్టీకి పూర్తి సమయం కేటాయించాలని కోరారు. తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగరడం ఖాయమని జోస్యం చెప్పారు. సమావేశంలో పార్టీ పార్లమెంట్ కన్వీనర్ చంద్రశేఖర్, శివరాజ్, శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, భూపాలాచారి, వెంకటేశ్ గుప్తా, వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సింహగౌడ్, మల్చలం మురళి, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఇసునాతి శ్రీనివాస్, శ్యాంసుందర్, సత్యనారాయణ, శ్రీనివాస్‌చారి, వెంకటేశ్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా తెలంగాణ

- దేశంలో ఎక్కడా లేని పథకాలు మనవద్దే..
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇస్తున్నారా?
- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సబితారెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మీర్‌పేట్‌లో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని అన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఆసరా పథకం కింద రూ. 2వేల నుంచి రూ.3 వేల వరకు పింఛన్లు ఇస్తున్నట్లు.. దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు దళిత బంధు కింద రూ.10 లక్షలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లు గుర్తు చేశారు. రైతులకు పంట పెట్టుబడి కింద రైతుబంధు, అకారణంగా మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల రైతు బీమా అందించి అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇస్తున్నారా అని మంత్రి ప్రశ్నించారు. ఖాళీ స్థలం ఉన్న పేదలకు ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం త్వరలో రూ.3 లక్షల ఆర్థిక సాయం చేయనుందన్నారు. బీజేపీ నేతలు కేసీఆర్ కుటుంబంపై అనవసర విమర్శలు చేస్తూ పబ్బం గడుపుతున్నారన్నారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ప్రతి వార్డు, గ్రామం, మండలాల్లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలన్నారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేసి.. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు గజ్జెల రాంచందర్, సిద్దాల లావణ్య, నాయకులు మాదరి రమేష్, జేటావత్ శ్రీనివాస్ నాయక్, దిండు భూపేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెప్రగతిలో భాగస్వాములు కావాలి



ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్

ఆమనగల్లు: పల్లెప్రగతిలో ప్రజలు భాగస్వాములు కావాలని జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్ కోరారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం మంగళపల్లి పంచాయతీలో పర్యటించారు. పల్లెప్రగతిలో చేపట్టిన కార్యక్రమాలను పరిశీలించారు. పంచాయతీ కార్యాలయం, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతమవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫారూక్ హుస్సేన్, పీఆర్ఏఈ కృష్ణయ్య, మంగళపల్లి సర్పంచ్ తిప్పిరెడ్డి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

తొమ్మిది నెలల్లో కోహెడ మార్కెట్

- అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వసతులు
- సిడ్నీ, మెల్‌బోర్న్ హోల్‌సేల్ మార్కెట్ల తరహాలో నిర్మాణం



అధికారులతో సమావేశమైన మంత్రి (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వసతులు ఉండేలా తొమ్మిది నెలల్లో కోహెడ మార్కెట్‌ను ఏర్పాటు చేసేలా బృహత్ ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం మార్కెటింగ్ శాఖ అధికారులు ఏర్పాట్లు మొదలు పెట్టారు. మొదటి దశలోనే మార్కెట్ పూర్తి స్థాయిలో పని చేసేందుకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి తెలిపారు. ప్రస్తుతం ఉన్న వయాంట్ సొల్యూషన్ కన్సల్టెంట్‌తో పాటు రాష్ట్ర మార్కెటింగ్ బోర్డుల ఎండీ సూచనలు పరిగణనలోకి తీసుకోనున్నట్లు వెల్లడించారు. మిషన్ భగీరథ పథకం నుంచి రోజుకు 2.4 లక్షల లీటర్ల తాగునీటిని తీసుకునేందుకు రూ.4 కోట్లు వెచ్చించాలని నిర్ణయించారు. మార్కెట్‌లో కింద షెడ్లపై కార్యాలయాలు ఉండేలా నిర్మాణాలు చేపట్టాలని ప్రణాళిక రూపొందించారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ, మెల్‌బోర్న్ నగరాల్లోని హోల్‌సేల్ పండ్ల మార్కెట్ల తరహాలో.. ఇక్కడి వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టనున్నారు. మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి కోహెడ మార్కెట్‌పై సమీక్షించారు. రూ.450 కోట్ల అంచనా వ్యయంతో 178.02 ఎకరాల విస్తీర్ణంలో కేవలం పండ్ల మార్కెటే కాకుండా.. ప్రస్తుతం మలక్‌పేటలో కొనసాగుతున్న మిర్చి మార్కెట్‌ను కూడా ఇక్కడికి తరలించేలా ప్రణాళికలు రూపొందించారు. 199.13 ఎకరాల్లో కోహెడ గ్లోబల్ గ్రీన్ మార్కెట్ 6 లక్షల చదరపు అడుగుల్లో నిర్మాణాలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

అక్రమంగా మట్టి తరలింపు

అడ్డుకున్న రైతులు



ఎర్రకుంటలో మట్టిని తవ్విన ప్రాంతం

యాచారం: మంతన్‌గౌరెల్లి–కేసీ తండా గ్రామాల మధ్యనున్న ఎర్రకుంట నుంచి ఇటుక బట్టీల వ్యాపారులు రాత్రికిరాత్రే మట్టిని తరలించారు. శని, ఆదివారాల్లో రాత్రిళ్లు జేసీబీ పెట్టి వందలాది ట్రిప్పుల మట్టిని టిప్పర్లలో నగరానికి తరలించారు. ఆదివారం రాత్రి గమనించిన మంతన్‌గౌరెల్లి, కేసీ తండాల రైతులు మట్టి తవ్వకాన్ని అడ్డుకుని పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశారు. అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేసీ తండా సర్పంచ్ మారు, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేనావత్ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు.

పేదలకు పట్టాలిచ్చే వరకు పోరాటం

- సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య
- అక్రమంగా కేసులు బనాయించడం సరికాదు



పట్టణ కేంద్రంలో సీపీఐ నాయకుల ర్యాలీ

చేవెళ్ల: పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చే వరకు పోరాడుతామని.. సమస్యలు పరిష్కరించే వరకు పేదలకు అండగా ఉంటామని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలతో కలిసి సోమవారం ఆయన ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు గుడిసెలు వేసుకున్న ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రభుత్వాన్ని కూల్చివేయడం ఖాయమని హెచ్చరించారు. భూస్వాములు, కబ్జాదారులకు అక్రమంగా ఆక్రమించుకుంటే పట్టించుకోని ప్రభుత్వం.. 60గజాల స్థలంలో పేదలు గుడిసెలు వేసుకున్నందుకు కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వాతాలు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి మాట్లాడుతూ.. జిల్లాలో భూ పోరాటాలు నిర్వహించి ఎంతో మంది పేదలకు ఇళ్ల స్థలాలు సాధించి పెట్టిన ఘనత సీపీఐకి ఉందన్నారు. చేవెళ్లలోనూ పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పించే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దాదాపు 42 రోజులుగా ఇంటి స్థలాలకోసం పోరాడుతుంటే ఎమ్మెల్యేకాని.. అధికారులు గానీ పట్టించుకోకపోవటం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, అధికారులు పేదల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం, నాయకులు వడ్ల సత్యనారాయణ, సత్తిరెడ్డి, ఎస్.జంగయ్య, శ్రీను, సుధీర్, సుధాకర్‌గౌడ్, మంజుల, మాధవి, బాబురావు, శివ, మల్లేశ్, శివయ్య, కృష్ణగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, శౌరీ, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ జంప్లానాయక్‌కు గోల్డ్‌మెడల్



అవార్డు అందుకుంటున్న జంప్లానాయక్

కడ్తాల్: కేఎన్ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్‌లో ఎంసీహెచ్ కార్డియో థొరాసిక్ సర్జరీ (ఓపెన్ హార్ట్ సర్జరీ) విభాగంలో మండల కేంద్రానికి చెందిన డాక్టర్ జంప్లానాయక్ గోల్డ్‌మెడల్ సాధించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో కాళోజీ నారాయణ రావు (కేఎన్ఆర్) హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బి.కరుణాకర్‌రెడ్డి, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డి, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నోజేందర్ ఆయనకు గోల్డ్ మెడల్ అందజేశారు. డాక్టర్ జంప్లానాయక్ గోల్డ్ మెడల్ సాధించడం పట్ల మండల కేంద్రానికి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ముమ్ముందు వైద్యరంగంలో మరింత ఉన్నత స్థానంలోకి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గోల్డ్‌మెడల్ కమిటీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎస్.కృష్ణారెడ్డి, ఉస్మానియా ఆస్పత్రి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎం.వీరేశం, కార్యదర్శి డాక్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి దొంగల హల్‌చల్

వెంటాడి పట్టుకున్న యువత

యాచారం: అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. వివరాల ప్రకారం.. ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి 10.30గంటల ప్రాంతంలో కందుకూరు మండలం మీరాఖాన్‌పేట నుంచి యాచారం మండలం కుర్మిద్ద గ్రామానికి వచ్చారు. వీరిలో ఇద్దరు కారులో, మరొక యువకుడు బైక్‌పై వచ్చారు. కుర్మిద్ద గ్రామంలో నీలం పాండుకు చెందిన ఆటోను కారులో వచ్చిన ఇద్దరిలో ఒక వ్యక్తి తీసుకుని తాడిపర్తి గ్రామం వైపు వెళ్తున్నాడు. గమనించిన పాండు విషయాన్ని గ్రామస్తులకు తెలపడంతో అప్రమత్తమైన యువత ఆటోను వెంబడిస్తూ తాడిపర్తి గ్రామంలోని స్నేహితులకు సమాచారం ఇచ్చారు. తాడిపర్తి గ్రామానికి చెందిన యువత పట్టుకునే లోపే తప్పించుకుని వెనుక వస్తున్న తన స్నేహితుడి బైక్‌పై నానక్‌నగర్ గ్రామం వైపు వెళ్లారు. వెంటనే తాడిపర్తి యువత నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన యువతకు ఫోను చేసి విషయం వివరించారు. అప్రమత్తమైన నక్కర్తమేడిపల్లి గ్రామస్తులు బైక్‌పై వస్తున్న వారిని పట్టుకున్నారు. కారులో నందివనపర్తి గ్రామం వైపు వెళ్లిన మరో వ్యక్తి నందివనపర్తి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద ఫోను తీసుకుని బైక్ వెళ్తూ దొరికిన వారికి ఫోన్ చేశాడు. దీంతో నక్కర్తమేడిపల్లి గ్రామస్తులు కారులో దొంగలు ఉన్నారు. వారిని పట్టుకోమని చెప్పారు. నక్కర్తమేడిపల్లిలో దొరికిన ఇద్దరి వ్యక్తులను, నందివనపర్తి గ్రామంలో దొరికిన మరో వ్యక్తిని పట్టుకుని ఆదివారం అర్ధరాత్రే పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

నర్సింలుకు జాతీయ అవార్డు



నర్సింలుకు ఎంపిక పత్రం అందజేస్తున్న రాధాకృష్ణ

షాద్‌నగర్‌రూరల్: బహుజన సాహిత్య అకాడమీ అందిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ జాతీయ అవార్డుకు ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జాంగారి నర్సింలు ఎంపికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ కార్యాలయంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా ఆయన ఎంపిక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం ఉద్యమకారులు, సంఘ సేవకులు, కవులు, రచయితలకు ఈ అవార్డులను అందజేస్తున్నామన్నారు. ఏప్రిల్ 2న హైదరాబాద్‌లలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న సమావేశంలో ఈ అవార్డును అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు మలగళ్ల మల్లేశ్, ప్రధాన కార్యదర్శి గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కొత్తూరు: ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం .. ఈ నెల 13న మండల పరిధిలోని మక్తగూడ గ్రామంలో సూర్యాపేటకు చెందిన మోహన్‌రావు అనే వ్యక్తి కింద పడి ఉన్నట్లు గ్రామస్తులు డయల్ 100కు ఫోన్‌చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఆయన్ను చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన సోమవారం మృతిచెందాడు. పెట్రోలింగ్‌లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ సంపత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

పిల్లలతో సహా గృహిణి అదృశ్యం

యాచారం: భర్త వేధింపులు తట్టుకులేక ఓ గృహిణి పిల్లలతో సహా అదృశ్యమైంది. ఈ ఘటన మాల్ గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ లింగయ్య తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన చీరమోని నాగమ్మ పెద్ద కూతురు మల్లేశ్వరిని అదే గ్రామానికి చెందిన కాటమోని గణేశ్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేసింది. వీరికి రేణుక, నందు సంతానం. ఈ నెల 25న మల్లేశ్వరి తల్లికి ఫోన్ చేసి భర్త వేధిస్తున్నాడని ఇంటికి తీసుకెళ్లాలని కోరింది. ఆమె తల్లి వచ్చే లోపే ఇద్దరు పిల్లలతో సహా వెళ్లిపోయింది. రెండు రోజులుగా బంధువులు, చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో నాగమ్మ సోమవారం యాచారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేతలపై పీడీ యాక్ట్ : సీఐ

కొత్తూరు: గంజాయి తరలిస్తున్న ముఠాను గతేడాది పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని న్యాయమూర్తి జైలుకు తరలించగా బెయిల్‌పై బయటకు వచ్చారు. దీంతో వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి మరోమారు జైలుకు తరలించినట్లు సీఐ బాలరాజు సోమవారం తెలిపారు. వివరాల ప్రకారం.. విశాఖ ఏజెన్సీ సీలేరు నుంచి సేకరించిన గంజాయి కార్లలో మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఈ ముఠాను గతేడాది జనవరి 27న కొత్తూరులో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 214 కిలోల గంజాయి, ఐదు సెల్ ఫోన్లు, మూడు కార్లు, రూ.2.10 లక్షల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇందులో మహారాష్ట్రకు చెందిన బాబా సా చెందేకర్, తిరుమలిబాబు, గణేశ్, రాజేంద్ర అహడేలు నేరానికి పాల్పడ్డట్లు సీఐ తెలిపారు. వీరిలో తిరుమల్‌బాబు ఫిబ్రవరిలో మృతి చెందాడు.

షార్ట్ సర్క్యూట్‌తో డీసీఎంలో మంటలు

శంషాబాద్: ప్రమాదవశాత్తు కుర్చీల లోడు లారీ దగ్ధమైన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. సోమవారం హయత్‌నగర్‌కు చెందిన డీసీఎం గగన్‌పహాడ్‌లోని పారిశ్రామిక వాడలో ఓ కంపెనీలోని కుర్చీలను లోడ్ చేశారు. జాతీయరహదారికి పైకి వచ్చిన డీసీఎంలోని క్యాబిన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. దీంతో డ్రైవర్ అప్రమత్తమై మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. కుర్చీలన్నింటికీ మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఫైరింజన్‌ను రప్పించి మంటలను ఆర్పివేయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫాంహౌస్‌లో హైటెక్ వ్యభిచారం

పోలీసుల అదుపులో 15 మంది యువకులు, నలుగురు యువతులు



ఫాంహౌస్‌లో పట్టుబడ్డ యువకులు

మొయినాబాద్: వ్యభిచారం నిర్వహిస్తున్న ఫాంహౌస్‌పై పోలీసులు దాడి చేసి 15మంది యువకులు, నలుగురు యువతులను పట్టుకున్నారు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనకమామిడి శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి కనకమామిడి శివారులోని ఓ ఫాంహౌస్‌లో వ్యభిచారం జరుగుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడి చేయగా నాలుగు గదుల్లో నలుగురు యువతీ యువకులు వ్యభిచారం చేస్తూ దొరికారు. మరో 11 మంది బయట మద్య సేవిస్తూ దొరికారు. వీరంతా కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రలకు చెందిన వారిగా గుర్తించారు. ఫాంహౌస్‌ను ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకుని ఇక్కడికి వచ్చారు. వారి వద్ద నుంచి 15 మద్యం బాటిళ్లు, రెండు కండోమ్ ప్యాకెట్లు, ఐదు కార్లు, 18 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- తొమ్మిది మంది అరెస్టు
- రూ.47వేల నగదు, ఎనిమిది సెల్‌ఫోన్‌ల స్వాధీనం

ఇబ్రహీంపట్నంరూరల్: పేకాట స్థావరంపై సోమవారం ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రవికుమార్ తెలిపిన ప్రకారం.. ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కయంజాల్ మున్సిపాలిటీ జనచైతన్యనగర్ కాలనీలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారని ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు దాడి చేసి పేకాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వారి వద్ద రూ.47వేల నగదు, 8 సెల్‌ఫోన్లు, నాలుగు సెట్ల కార్డులు స్వాధీనం చేసుకున్నారు. జూదరులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవికుమార్ తెలిపారు.



పోలీసులు పట్టుకున్న పేకాటరాయుళ్లు

మహిళ పైనుంచి దూసుకెళ్లిన వాహనం

- అక్కడికక్కడే మృతి
- స్కూల్ బస్సు కోసం ఎదురు చూస్తుండగా ఘటన

పహాడీషరీఫ్: స్కూల్ బస్సు కోసం ఎదురుచూస్తున్న ఓ మహిళపై నుంచి వాహనం దూసుకెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ భాస్కర్ కథనం ప్రకారం.. షాహీన్‌నగర్‌కు చెందిన మహ్మద్ జుబేర్, పర్వీన్ బేగం(30) దంపతుల కుమారుడు స్థానికంగా ఉన్న మదర్సాలో చదువుతున్నాడు. సోమవారం ఉదయం తన కుమారుడికి పండ్లు పంపించేందుకుగాను రెగ్యులర్‌గా వచ్చే స్కూల్ బస్సు కోసం ఆమె షాహీన్‌నగర్ హైవే హోటల్ బస్టాప్ రోడ్డులో మరో మహిళతో కలిసి నడుచుకుంటూ వెళుతోంది. ఈ సమయంలో వెనుక నుంచి టీఎస్ 07 యుజీ 1491 నంబర్‌గల వాహనం దూసుకొచ్చి పర్వీన్ బేగంను ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలొదిలింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐకియా జంక్షన్ టు ఎయిర్‌పోర్టు

మెట్రో భూసామర్థ్య పరీక్షలు ప్రారంభం

- నమూనాగా వంద పిల్లర్లు
- 40 అడుగుల లోతు తవ్వకాలు
- రెండు నెలల్లో పనుల పూర్తి
- ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: ఎయిర్‌పోర్టు మెట్రో మార్గంలో సోమవారం భూసామర్థ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే అలైన్‌మెంట్ స్థిరీకరణ, పెగ్‌మార్కింగ్ పనులు పూర్తయిన సంగతి తెలిసిందే. ఐకియా జంక్షన్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 100 మెట్రో పిల్లర్లను నమూనాగా తీసుకొని భూసామర్థ్య పరీక్షలను చేపట్టినట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. సుమారు రెండు నెలల్లో ఈ పనులను పూర్తి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మెట్రో స్తంభాల నిర్మాణం ప్రతిపాదించిన ప్రతి చోట భూమి ఉపరితలం నుంచి సుమారు 40 అడుగుల లోతు వరకు తవ్వకాలు జరుపుతారు. 'ఇన్–సిటు' (అక్కడికక్కడ) పరీక్షలు నిర్వహించడంతో పాటు ప్రయోగశాల మట్టి నమూనా పరీక్షలు కూడా నిర్వహించి భూసామర్థ్యాన్ని నిర్ణయిస్తారు. ఈ పరీక్షల వల్ల స్తంభాల పునాదులను ఏ మేరకు తవ్వాలనే అంశంపై ఒక స్పష్టత వచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఓపెన్ ఫౌండేషన్, పైల్ ఫౌండేషన్, బేరింగ్ ప్రెజర్‌ను ఏ మేరకు అనుమతించవచ్చనే అంశాలు తెలుస్తాయి. మరోవైపు ఈ పరీక్షలు నిర్వహించడం వల్ల టెండర్ ప్రక్రియలో పాల్గొనే బిడ్డర్‌లకు కూడా ప్రాజెక్టు నిర్మాణం జరిగే భూమి తీరుపై ఒక అవగాహన కలుగుతుంది. దీంతో తగినవిధంగా ఆర్థిక అంచనాలను రూపొందించుకొని టెండర్‌లలో పాల్గొనగలుగుతారు. చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ బి. ఆనంద్‌మోహన్, సూపరింటెండెంట్ ఇంజనీర్ సాయపరెడ్డిల నేతృత్వంలోని హెచ్ఏఎంఎల్ ఇంజనీరింగ్ బృందం భూసామర్థ్య పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తోంది. జీహెచ్ఎంసీ, జలమండలి, ట్రాఫిక్ పోలీసు తదితర ప్రభుత్వ విభాగాల సమన్వయంతో ఈ పనులు జరుగుతున్నాయి. పనులు జరిగే ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన బారికేడింగ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.